నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | ఆదివారం 24 నవంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

# కేసీఆర్ సినిమా వంద రోజులు ఆడాలి



రాఘవేంద్ర థియేటర్‌లో కేశవ చంద్ర రమావత్ (కేసీఆర్) సినిమాను చూస్తున్న చిత్ర బృందం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు

జన్నారం, నవంబర్ 23 : సేవాలాల్ ఆశీస్సులతో కేసీఆర్ (కేశవ చంద్ర రమావత్) సినిమా వంద రోజులు ఆడాలని ఆదిలాబాద్ మాజీ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని రాఘవేంద్ర సినిమా హాల్‌లో ప్రదర్శించిన చిత్రాన్ని నిర్మాత రాకేశ్, డైరెక్టర్ గరుడ అంజి, బృందం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తిలకించారు. అంతకు ముందు స్థానిక అంగడిబజార్ చౌరస్తా నుంచి సినిమా హాల్ వరకు చిత్ర బృందం సభ్యులకు డప్పు చప్పుళ్ల నడుమ ఘన స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని వర్గాల వారు చూడాల్సిన సినిమా అని, రాష్ట్రం రాకముందు.. తెలంగాణ వచ్చిన తర్వాత పదేళ్లలో సాధించిన ప్రగతిని ప్రేక్షకులకు కళ్లకుకట్టినట్లు చూపించారని చిత్ర బృందాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ శీలం రమేశ్, మాజీ ఎంపీపీ మాదాడి సరోజన, నాయకులు పూర్ణచందర్‌నాయక్, సిటిమల్ల భరత్‌కుమార్, మున్వర్ అలీఖాన్, ఫజల్, సులువ జనార్దన్, శ్రీనివాస్‌గౌడ్, నర్సాగౌడ్. జబర్దస్త్ యాక్టర్ సుజాత పాల్గొన్నారు.



మహారాష్ట్రలో ఘోర పరాభవం పాలైన హస్తం

# కాంగ్రెస్‌కు మహా ఝలక్

- ఆదిలాబాద్ సరిహద్దు నియోజకవర్గాల్లో ఓటమి
- తెలంగాణ సీఎం, మంత్రులు ప్రచారం చేసినా దక్కని ఫలితం
- ఇష్టమొచ్చిన హామీలకు కరగని మరాఠా ఓటర్లు
- తెలుగు ప్రజలను ఆకట్టుకోవడంలో విఫలమైన లీడర్లు

### కాంగ్రెస్ హామీలు నమ్మలేదు..



కాంగ్రెస్ నాయకులు ఎన్ని హామీలు ఇచ్చినా ఇక్కడి ప్రజలు నమ్మలేదు. మహారాష్ట్రలో ఇప్పు డున్న కూటమి పాలన బాగుంది. ప్రజలకు మంచి సౌకర్యాలు అందుతున్నాయి. కాంగ్రెస్ వాళ్లు 11 నెలల్లో తెలంగాణలో చేసింది ఏం లేదు. మా దగ్గరికి వచ్చే రైతులు, ప్రజలు ఎంత బాధపడుతుంటారో కల్లారా చూశాం. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మా పాలన బాగుందని, ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేస్తున్నామని చెప్పిన మాటలు నమ్మలేదు.
**- గేడాం మానిక్, హిరాపూర్, కిన్వట్ నియోజకవర్గం.**

### తెలంగాణలో మోసం చేశారు..



అమలు సాధ్యం కానీ హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను కాంగ్రెసోళ్లు మోసం చేశారు. గ్యారెం టీలు అమలు చేశామని, ఇచ్చిన హామీలు నిల బెట్టుకున్నామని అబద్ధాలు చెప్పారు. ఆ మాట లు మా దగ్గర ఎవరూ నమ్మలేదు. అందుకే కాంగ్రెస్ కూటమికి ఓట్లు వేయలేదు. నాం దేడ్ పార్లమెంట్ పరిధిలోని ఏ అసెం బ్లీలోనూ వాళ్లకు ఓట్లు వేయలేదు. గతంలో బంగారంగా ఉన్న తెలంగాణ ఇప్పుడు ఎన్నో ఇబ్బందులు పడు తుంది. అలాంటి రోజులు మా దగ్గర రావొద్దు.
**- రాజు, బోకర్ నియోజకవర్గం.**



మంచిర్యాల, నవంబర్ 23(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాభవం చవి చూసింది. తెలంగాణలో అధికారంలోకి వచ్చాక చేసిందేమి లేకపోయినా.. ఆరు గ్యారెంటీలను అమలు చేశామని, 40 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు చెప్పిన మాటలకు మహారాష్ట్ర ఓటరు నమ్మలేదు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో సరిహద్దు పంచుకుంటున్న మహారాష్ట్ర నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటర్లు ఝలక్ ఇచ్చారు. అమలు సాధ్యం కాని హామీలిచ్చి తెలంగాణ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మహారాష్ట్రలో కూడా ఓట్లను కొల్లగొట్టాలని భావించింది. ఏఐసీసీ ఆదేశాలతో తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, పీసీసీ డెలిగేట్స్ అంతా కలిసి ప్రచారానికి ఎగబడ్డారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ పోటీ పడ్డారు. నాందేడ్ లోక్‌సభకు జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. కానీ.. తెలంగాణ కాంగ్రెస్ లీడర్ల హామీల్లోని ఆంతర్యాన్ని మరాఠాలు గుర్తించారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత కరెంట్, ధాన్యం కొనుగోళ్లు, ఎరువులు, విత్తనాల సరఫరా, ఇబ్బందుల్లేని వ్యవసాయ రంగాన్ని చూసిన మహారాష్ట్రవాసులు.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇవేవి కనిపించకపోవడంతో ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన రీతిలో కర్రు కాల్చి వాత పెట్టారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు ప్రచారం చేసిన నిర్మల్ జిల్లా పొరుగున ఉన్న నియోజకవర్గాలైన బోకర్, నయాగాంలోనూ కాంగ్రెస్‌కు ఓటమి తప్పలేదు.

## హస్తం పార్టీకి గుణపాఠం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పక్కనున్న మహారాష్ట్ర నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓటమి పాలైంది. (బీజేపీ, శివసేన, ఎన్‌సీపీ (అజిత్ పవార్)) పార్టీల కలయికతో ఏర్పడిన మహాయుతి సత్తా చాటింది. ఆదిలాబాద్ జిల్లా పక్కనున్న అర్ని, కిన్వట్, నిర్మల్ జిల్లా పక్కనున్న బోకర్, నయాగాం నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓటమి పాలయ్యారు. ఈ నాలుగు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ పార్టీ రెండోస్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలతో కలిసి సరిహద్దు పంచుకుంటున్న అహేరి నియోజకవర్గంలో కాంగ్రెస్ మూడో స్థానంతో నిలిచింది. ఆసిఫాబాద్ పక్కనున్న చంద్రాపూర్ నియోజకవర్గంలోనూ హస్తం పార్టీకి ఓటమి తప్పలేదు. తెలంగాణకు పశ్చిమ దిక్కున మహారాష్ట్రలో కాంగ్రెస్ సిట్టింగ్ స్థానంగా ఉన్న నాందేడ్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ చిత్తుచిత్తుగా ఓడిపోయింది. ఇక్కడ రాహుల్‌గాంధీతోపాటు తెలంగాణ మంత్రులు, ఎంపీలు పెద్ద ఎత్తున ప్రచారం చేసిన ఆశించిన ఫలితం రాలేదు. ప్రధానంగా ఇక్కడ ఉండే తెలంగాణ ప్రజలు(తెలుగు మాట్లాడే వారు) కాంగ్రెస్ నాయకుల హామీలకు కరగలేదు. ఈ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ హస్తం పార్టీ ఖాత తెరవలేదంటే.. తెలంగాణ ప్రభావం ఈ ఎన్నికలపై ఎంతగా పడిందో అర్థం చేసుకోవచ్చు.

# పది రోజులకో ప్రాణం పోతున్నా పట్టదా?

- మృతి చెందిన విద్యార్థినుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున పరిహారమివ్వాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- నిమ్స్‌లో విద్యార్థిని శైలజకు పరామర్శ



విద్యార్థిని శైలజను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ)/వాంకిడి, నవంబర్ 23 : సర్కారు విద్యాలయాల్లో పది రోజులకో బిడ్డ ప్రాణం పోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజను, ఆమె కుటుంబ సభ్యులను శనివారం వారు వేర్వేరుగా పరామర్శించారు. వారు మాట్లాడుతూ 11 నెలల కాంగ్రెస్ పాలనలో 42 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని, వారి కుటుంబ సభ్యులకు రూ. 10 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వాంకిడిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై నిమ్స్‌లో చేరిన జ్యోతి, మహాలక్ష్మి డిశ్చార్జి అయ్యారని, కానీ శైలజ పరిస్థితి మాత్రం విషమంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహాల్లో పురుగుల అన్నం తినలేక విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థిని ఈ స్థితికి రావడానికి పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి నోరు తెరిచినప్పుడల్లా కేసీఆర్ మూలాలను తుడిచేస్తానంటున్నాడే తప్ప.. గురుకుల విద్యార్థుల సంక్షేమాన్ని మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందలతో నిరసన తెలుపుతున్న మహిళలు

# నిత్యం నీటి తిప్పలే..

- చెన్నూర్ పట్టణ ప్రజల అవస్థలు
- మరమ్మతులు చేయక అందని భగీరథ నీరు
- ఉన్న బోరు బావులకూ తాళాలు
- మున్సిపల్ అధికారుల తీరుపై ఆగ్రహం
- బల్దియా ఎదుట ఆందోళనలు

చెన్నూర్, నవంబర్ 23 : చెన్నూర్ పట్టణంలో నిత్యం ఏదో ఒక వార్డులో ప్రజలు నీటి సమస్యను ఎదుర్కోవడం పరిపాటిగా మారింది. తలాపునే గోదావరి నది ప్రవహిస్తున్నా శాశ్వత పరిష్కారం చూపే నాథుడు లేక అవస్థలు పడాల్సి వస్తున్నది. ఇక నీటి తిప్పలు తీర్చాల్సిన యంత్రాంగం అత్యుత్సాహం ప్రదరిస్తూ బోర్లకు తాళాలు వేస్తుండగా, స్థానికుల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది.

### పెరిగిన జనాభా.. పట్టని యంత్రాంగం

చెన్నూర్ పట్టణ ప్రజలకు తాగు నీరందించేందుకుగాను 50 ఏళ్ల క్రితం అప్పటి సర్కారు నల్లాలు ఏర్పాటు చేసింది. అప్పటి నివాస గృహాలు, ప్రజల అవసరాలను బట్టి పట్టణ సమీపంలోని బతుకమ్మ వాగులో సంప్.. ప్రభుత్వ దవాఖాన సమీపంలో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించింది. వార్డులతో పాటు అవసరమున్న ఇళ్లకు నల్లా కలెక్షన్లు ఇచ్చింది. అప్పట్లో నల్లాల ద్వారా రెండు పూటలు సరిపడా నీరు సరఫరా జరిగేది. క్రమేనా పట్టణ విస్తీర్ణం పెరిగింది. పట్టణ జనాభా పెరగగా, వేల సంఖ్యలో గృహాలు నిర్మాణమయ్యాయి. అందుకనుగుణంగా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేయకపోవడంతో నిత్యం నీటికి ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. పట్టణంలోని పలు వార్డుల్లో అధికారులు బోరు బావులు ఏర్పాటు చేయగా, ప్రజలు తమ నీటి అవసరాలను తీర్చుకునేవారు. ఆపై ఆ బోరు బావులకు విద్యుత్ మోటర్లను అమర్చి.. ఇంటింటికీ పైపులైన్‌లు ఏర్పాటు చేయగా, ప్రస్తుతం ఆ నీటినే వాడుకుంటున్నారు

### అధికారుల అత్యుత్సాహం..

చెన్నూర్ పట్టణంలోని దాదాపు 80 శాతం మంది బోరు బావుల మీదే ఆధారపడుతున్నారు. ఈ బోరు బావులకు ఏర్పాటు చేసిన విద్యుత్ మోటర్లకు సంబంధించిన స్టార్టర్ల బాక్సులకు ఈ నెల 4న మున్సిపాలిటీ అధికారులు తాళాలు వేశారు. దీంతో నీటి సరఫరా నిలిచి పలు వార్డుల్లో తీవ్ర నీటి సమస్య ఏర్పడింది. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో అధికారులు తాళాలను తీశారు. ఆ తర్వాత వార్డుల్లో ఎప్పటిలాగే నీరు సరఫరా జరుగుతున్నది. అయితే, రజక వాడలోని బోరు బావి విద్యుత్ మోటర్ స్టార్టర్ బాక్సుకు శుక్రవారం మున్సిపాలిటీ సిబ్బంది మరోసారి తాళాలు వేయడంతో మహిళలు మున్సిపాలిటీ కార్యాలయ ముందు ధర్నా చేపట్టారు. దీంతో అధికారులు తాళాలు తీశారు. తిరిగి శనివారం ఉదయం మరోసారి తాళాలు వేయడంతో మహిళల్లో ఆగ్రహం కట్టలు తెంచుకున్నది.

### మరమ్మతులు లేక అందని భగీరథ నీరు

కేసీఆర్ సర్కారులో మిషన్ భగీరథ పథకం ద్వారా పైపులైన్‌లు ఏర్పాటు చేసి ఇంటింటికీ నల్లా నీరు అందించారు. కొన్ని రోజుల పాటు ఇంటింటికీ రెండు పూటలా నీరు సరఫరా చేశారు. క్రమేనా సర్కారు మారడం.. చిన్న చిన్న రిపేర్లను అధికారులు పట్టించుకోకపోవడంతో తాగు నీరు సరఫరా నిలిచిపోయింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగు నీరందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపాలిటీ కమిషనర్ మురళీకృష్ణను సంప్రదించగా అందుబాటులో లేరు.

ఖాళీ బిందెలతో మున్సిపాలిటీ కార్యాలయానికి చేరుకొని ధర్నా చేశారు. మున్సిపాలిటీ అధికారుల అత్యుత్సాహం వల్లే నీటి సమస్య తలెత్తుతుందని మహిళలు మండిపడ్డారు.

### తాగునీటికీ తప్పని తిప్పలు

బోరు బావుల నీరు తాగు నీటికి పనికి రాకపోగ.. ఇంటి అవసరాలకే వాడుకుంటున్నారు. తాగు నీటికి మాత్రం నిత్యం తిప్పలు పడుతున్నారు. ఆర్థికంగా ఉన్నవారు మినరల్ వాటర్ కొనుక్కుంటుండగా.. మిగతా వారు ప్రభుత్వ దవాఖాన సమీపంలోని ఓవర్ హెడ్ వ్యాటర్ ట్యాంకు వద్దకు వెళ్లి బిందెల్లో తాగు నీరు తెచ్చుకుంటున్నారు.

### రెండో రోజూ మహిళల ధర్నా

చెన్నూర్, నవంబర్ 22 : పట్టణంలోని రజకవాడలోగల బోరు బావి విద్యుత్ మోటర్ స్టార్టర్‌కు సంబంధించిన బాక్స్‌కు మున్సిపాలిటీ సిబ్బంది తాళం వేయడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం రెండో రోజూ స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

### తాళం వేసి గోస పెడుతున్నరు



*మా వార్డులో ఉన్న బోరు బావి మోటర్ స్టార్టర్ బాక్స్‌కు మున్సిపాలిటీ అధికారులు తాళం వేయడం వల్ల మస్తు తిప్పలైతంది. ఇది వరకు బోరు బావి పాడైపోవడంతో 15 రోజులు నరకం చూసినం. ఈ మధ్యే దానిని మంచిగ చేయించారు. ఏందుకో ఏమో.. నిత్యం దానికి తాళం వేస్తున్నారు. గీ బోరు బావిపై 20 కుటుంబాలు ఆధారపడ్డాయి. సార్లు నీటి సమస్యను పరిష్కరించాల్సింది పోయి గిట్లా గోస పెడుతున్నరు. ఇకనైనా మా బాధ పట్టించుకోవాలె.*
**- జయ్యారపు రమా, రజకవాడ, చెన్నూర్**

### మస్తు తిప్పలైతంది..



*బోరు బావే మాకు దిక్కు. దానికి తాళం వేయడం ఏమిటో అర్థం కావడం లేదు. మస్తు తిప్పలైతంది. మా ఇబ్బందులు చూసి కూడా అలా చేయడం సరికాదు. గందుకే మున్సిపల్ కార్యాలయానికి వచ్చి ధర్నా చేస్తున్నం. అంతకుముందు మిషన్ భగీరథ నీళ్లచ్చేవి. దానిని మంచిగ చేసేటోళ్లు లేరు. ఇకనైనా సార్లు స్పందించి మా గోస తీర్చాలె.*
**- పున్న రమా, రజకవాడ, చెన్నూర్**



బోరు బావికి అమర్చిన పైపులు.. స్టార్టర్ బాక్స్‌కు తాళం వేసిన మున్సిపల్ సిబ్బంది (ఇన్‌సెట్లో)



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

# కాంగ్రెస్ సర్కారులో అభివృద్ధి శూన్యం

- బీఆర్ఎస్ చేపట్టిన పనులకు కొత్తగా కొబ్బరి కాయలు కొడుతున్నరు
- మెడికల్ కళాశాలను తిరిగి తీసుకురావాల్సిన బాధ్యత వినోద్‌దే
- మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, నవంబర్ 23 : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి శూన్యమని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకే ప్రొసీడింగ్‌లు మార్చి కొత్తగా కొబ్బరికాయలు కొడుతున్నారని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.5 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాన్ని మంజూరు చేయగా, ప్రస్తుతం సున్నాలు వేసి ప్రారంభించారన్నారు. భవనం మొదటి అంతస్తును త్వరితగతిన పూర్తి చేసి, ముందు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలన్నారు. కేసీఆర్ సర్కారులో 350 ఎకరాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌ను మంజూరు చేసి 27 కంపెనీలను ముందుకు తీసుకొచ్చామని, కానీ కాంగ్రెస్ ఆ పనులను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభమైతే వేలాది మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. బెల్లంపల్లి నుంచి తరలిపోయిన మెడికల్ కళాశాలను తిరిగి తీసుకురావాల్సిన బాధ్యత ఎమ్మెల్యే వినోద్‌పై ఉందన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటును కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను అప్‌గ్రేడ్ చేశారని, బెల్లంపల్లిలో కనీసం కళాశాల లేకపోవడంతో ఈ ప్రాంత విద్యార్థులు తీవ్ర నిరాశ చెందుతున్నారని తెలిపారు. వీకెండ్ ఎమ్మెల్యేలా కాకుండా నిరంతరం ప్రజల మధ్య ఉండి సమస్యలు పరిష్కరించాలని కోరారు. పక్షం రోజులుగా పట్టణంలో తాగునీటి సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలను అమలులో చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి వైఫల్యం చెందారని తెలిపారు.